క్లుప్తంగా

గ్రామాల విలీనం చేపట్టాలి



వాలకపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

కాకినాడ రూరల్: వాలకపూడి గ్రామంతోపాటు పలు గ్రామాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వాకలపూడిలోని యాదవ కల్యాణ మండపంలో మాజీ సర్పంచు గింజాల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో పౌర సేవా సంఘం కన్వీనరు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలంలోని వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, ఇంద్రపాలెం, తూరంగి తదితర గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కోసం ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. 13ఏళ్లుగా కాలయాపన కారణంగా ఆయా గ్రామాలు అభివృద్ధి చెందడం లేదన్నారు. సమావేశంలో మండా సింహాద్రిరాజు, ఎం.సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నల్లబాబు, మూర్తి, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పేద మహిళలకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఎస్.పెద్దిరెడ్డి సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని అన్నారు. నిస్వార్థంగా ఎలాంటి సేవ చేసినా భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'యంగ్ మైండ్స్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి, యంగ్ మైండ్స్ సంస్థ సభ్యులు

బాలాజీచెరువు: స్థానిక ఫారెస్ట్ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన యంగ్ మైండ్స్ సేవా సంస్థ అవగాహన సదస్సు, పోస్టర్‌ను ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి యంగ్ మిడ్డే టీమ్‌తో ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీన విద్యార్థులకు ఐఐటీ చదువులపై, యువతకు పోటీ పరీక్షలు, కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. యువతలో క్రియేటివిటి పెంపొందించుట, విద్యార్థి దశ నుంచి సైన్సు ప్రయోగాలు, పర్యవరణ పరిరక్షణ, మొక్కలు నాటడంపై ఆసక్తి కలిగించడం, వైద్యసలహాలు, సూచనలు, రక్తదానం సేవా కార్యక్రమాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాల సంస్థ ద్వారా చేపడతామని సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. సంస్థ అధ్యక్షుడిగా తాను, కార్యదర్శిగా డి.బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా పడాల ఏడుకొండలు, గౌరవ అధ్యక్షుడుగా నరాల కృష్ణకుమార్ సభ్యులుగా కంచుమర్తి రామకబుష్ణ, బి.మంగారావు, పి.ఇందిరాగాంధీ, వై.నీరజ, ఎ.వెంకటరమణ తదితరులు ఉన్నారన్నారు. ఈ అవగాహన సదస్సులో ప్రముఖ గణిత, సైన్సు కోవిదులు, ఐఐటీ, ఐఏఎస్, ఐపీఎస్ ర్యాంకర్లు విద్యావేత్తలు, ప్రముఖులు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు.

కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు బహిరంగ వేలం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి బుధవారం తెలిపారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే పాటదారులు ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న పాటదారుడు పాడిన మొత్తం సొమ్ముతో పాటు 12 నుంచి 18 శాతం జీఎస్టీ సొమ్మును తక్షణమే చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 94417 48547, 99895 66535 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలు అరికట్టాలి

సామర్లకోట: పెద్దాపురం పట్టణ పరిధిలో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టాలని చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు ముప్పన వీర్రాజు అన్నారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరాలకు సంబంధించి ఆయన పెద్దాపురం ఎస్సై సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఫేస్ బుక్‌లో సైబర్ నేరానికి సంబంధించిన వ్యక్తుల నుంచి బెదింపులు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వీర్రాజు తెలిపారు.

టెంపుల్ స్ట్రీట్.. ట్రాఫిక్ ఫీట్

- దేవాలయం వీధిలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తం
- వన్ వేకి తిలోదకాలు, తరచూ ప్రమాదాలు
- ఇరుకుదారులతో ప్రయాణికుల గందరగోళం



రోడ్డును ఆక్రమించిన కార్ పార్కింగ్



వన్‌వేలో నిబంధనలకు విరుద్ధంగా దూసుకుపోతూ



భవంతి నిర్మాణానికి రోడ్డుపై వేసిన మెటీరియల్



రోడ్డు మీదే నిలిపి వేసిన ఆటోలు

కాకినాడ క్రైం: పురాతన దేవాలయాల ఘనకీర్తిని ఘడించిన కాకినాడలోని దేవాలయం వీధి తన శోభను కోల్పోతోంది. ట్రాఫిక్ చట్రాలలో చిక్కుకొని విలవిల్లాడుతోంది. ఇరుకు రోడ్లు, పెరుగుతున్న జనం, వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనాల నుంచి వచ్చే రణగొణ ధ్వనులతో దేవాలయం వీధి వాసులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ లోపమే దుస్థితికి దారి తీసిందని వీధ వాసులు వాపోతున్నారు. .

ఇదీ కారణం

దేవాలయం వీధిలో పెరిగిన వ్యాపార కార్యకలాపాలు, నివాస సముదాయాలు ట్రాఫిక్ రద్దీకి అంతర్గతంగా కారణం అయితే నూతనంగా ఏర్పాటు చేసిన జగన్నాథపురం అనుసంధాన వారధి వార్ఫ్ రోడ్ వల్ల ట్రాఫిక్ ఎక్కువవుతోంది. దేవాలయం వీధి వన్‌వేగా కొనసాగుతున్నా అనధికారికంగా ఇరువైపులా నిబంధనలు అతిక్రమించి వాహనాలు దూసుకెళ్లిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త వంతెన నిర్మాణం తర్వాత భారీ వాహనాల ప్రయాణానికి ఆ మార్గం గుండా అనుమతివ్వని పోలీసులు ఇటీవల నిబంధనలపై నీళ్లు చల్లేశారు. దీంతో భారీ వాహనాలు అతివేగంగా దేవాలయం వీధి నుంచే వస్తున్నాయి. వ్యాన్లతో పాటు భారీ బస్సులు ఆ ఇరుకు మార్గాలలోనే ఇరుక్కుంటూ యథేచ్ఛగా తిరిగేస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న దేవాలయం వీధిలో దైవదర్శన వేళా ట్రాఫిక్ బీభత్సం సృష్టిస్తోంది.

నిర్లక్ష్యం వల్లే..

కాకినాడ మెయిన్ రోడ్‌కుప్రయాణాలు, ట్రాఫిక్ నిర్వహణ పరంగా ఎంతటి ప్రాధాన్యత ఉందో అంతే ప్రాధాన్యత దేవాలయం వీధికి కూడా ఉంది. ప్రయాణికులకు మెయిన్ రోడ్ వన్ వే అయితే మరో మార్గం దేవాలయం వీధే. అయితే, ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ మార్గం నిర్వహణలో నిర్లక్ష్యం ప్రయాణికులను ఇక్కట్లకు గురిచేస్తోంది.

సకల సముదాయాలు ఇక్కడే...

టెంపుల్ స్ట్రీట్ ఇరుకు అనే కంటే నిర్వహణ లోపం కారణంగా ఈ స్థితి వచ్చింది. కోర్టు సహా జ్యువెలరీ వ్యాపార సముదాలన్నీ ఇక్కడే ఉన్నాయి. ఎన్నో కార్పొరేట్ ఆఫీసులు తమ కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగిస్తున్నాయి. ఒక్క దేవాలయం వీధిలోనే 9 వరకు ప్రైవేటు ప్రభుత్వ బ్యాంకులు ఉన్నాయి. ఆసుపత్రులకు దేవాలయం వీధి నెలవు. పురాతన దేవాలయాలు నాలుగు, తర్వాత కాలంలో ఏర్పాటు చేసిన చిన్న పెద్ద గుళ్లు మరో 8 ఇలా మొత్తం ఈ ఒక్క వీధిలోనే 12 దేవాలయాలు ఉన్నాయి. ప్రతిష్టాత్మక కల్యాణ మండపాలు ఇక్కడే ఉన్నాయి. ఇలా సుమారు కిలోమీటర్ మేర వ్యాపించి ఉన్న ఈ వీధి కాకినాడ ఉనికి, ప్రతిష్టలో కీలక పాత్ర పోషిస్తోంది.

వీటితో సమస్య

దేవాలయం వీధి ట్రాఫిక్ నిర్వహణలో లోపానికి పోలీసుల నిర్లక్ష్యంతోపాటు అదనపు సమస్యలు ఉన్నాయి. అయితే ఇవి కూడా పోలీసుల బాధ్యతకు పరోక్షంగా ముడిపడి ఉన్నాయి. ఆ వీధిలో నిత్యం నిర్మాణాలు జరుగుతుండగా ఆ మెటీరియల్ అంతా రోడ్ మీదే డంపు చేస్తున్నారు, ఇది ప్రయాణాలకు ఆటంకంగా మారుతోంది. పలు చోట్ల అండర్ గ్రౌండ్ పార్కింగ్ లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఎక్కువవుతోంది.

పోలీసులు, ప్రజలు బాధ్యతగా ఉండాలి



దేవాలయం వీధి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసుల దృష్టి సారించడంలేదు. ఆ దిశగా మార్పు రావాల్సి ఉంది. అయితే ప్రజల్లో కూడా కనీస బాధ్యత ఉండాలి. వన్ వేలో దూసుకొచ్చి కదులుతున్న ట్రాఫిక్‌కు అంతరాయాలు కలిగించడం, ప్రమాదాలకు కారణం అవ్వడం మంచిది కాదు. ఖజానా జ్యూవెలరీ సెంటర్‌లో పార్కింగ్ సమస్య కారణంగా మరింత జటిలమవుతోంది.

– ఎంఆర్ఎస్ సర్వారాయుడు, దేవాలయం వీధి నిర్వాసితుడు

పెరిగిన ఒత్తిడి



దేవాలయం వీధిపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగింది. పార్కింగ్ లోపమే ఇందుకు కారణం దేవాదాయ శాఖ, ప్రైవేటు స్థలాల సేకరణ జరిపి ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలు నిర్వహిస్తే ప్రయోజనం చేకూరుతుంది. ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేసి నిపుణులతో తగిన మార్గదర్శకాలు తీసుకోవాలి. అలాగే స్మార్ట్ సిటీ ప్రయోజనాలను దేవాలయం వీధికి కూడా బదలాయించి బీ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– దూసర్లపూడి రమణరాజు, సామాజిక వేత్త, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, కాకినాడ

రోటరీ గోల్డ్ రథసారథిగా శ్రీకాంత్



క్లబ్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

బోట్‌క్లబ్: స్థానిక రోటరీ హాల్‌లో బుధవారం రోటరీగోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా శిష్టా శ్రీకాంత్, కార్యదర్శిగా దామెర శ్రీకాంత్, కోశాధికారిగా పి.స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ గవర్నర్‌గా ధనసాగర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పేపకాయల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చార్మినార్ వర్మ, ఇంటరాక్టు క్లబ్ చైర్మన్‌గా ఎస్.చిరంజీవిరెడ్డి, ఇంటర్నేషనల్ సర్వీసెస్ చైర్మన్‌గా వాడ్రేవు రవి ఎన్నికయ్యారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో మరెన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ సిటీ: వార్షిక మరమ్మతుల కారణంగా కాకినాడ డీ-7 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కాకినాడ డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి ప్రసాద్ బుధవారం తెలిపారు. 33/11 కేవీ డెయిరీ ఫారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. డెయిరీఫారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పల్లంరాజునగర్ ఫీడర్‌పై ఉన్న పల్లంరాజునగర్ 1, 2, 3, 4, 5 వీధులు, సెవెన్ హిల్స్ రోడ్, అయోధ్యనగర్, 1, 2, 3 వీధులు, ఆదిత్య కాలేజీ రోడ్డు, ఇందిరా కాలనీ, సాంబమూర్తి నగర్ 4, 5 వీధులు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రసాద్ కోరారు.

కొత్త ఎయిర్ పోర్ట్ కరప మండలంలో ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ హిందూచైతన్య సదస్సు అధ్యక్షుడు రఘు

కరప: రాష్ట్రంలో కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించాలని తలపెట్టిన నేపథ్యంలో ఒకటి కాకినాడ జిల్లా కరప మండలంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు పేర్కొన్నారు. పెనుగుదురులో బుధవారం జరిగిన హిందూ చైతన్య సదస్సు, బీజేపీ నాయకుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఏర్పాటు చేయాలనుకునే విమానాశ్రయాన్ని కరప మండలం గురజనాపల్లి, పెనుగుదురు గ్రామాల మధ్యలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ రెండు గ్రామ పంచాయతీల పరిధిలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సాల్ట్ భూములు 1127 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ భూములు కాకినాడ నగరానికి సమీపంలో ఉన్నందున సరిహద్దు జిల్లాలకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుందన్నారు. కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన కొబ్బరి, చేపలు, రొయ్యలు తదితర ఉత్పత్తులకు అనువుగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని రఘు తెలిపారు. బుద్దాల సత్యనారాయణ, ముమ్మిడి పెద్ద కాపు, కాదా సత్యనారాయణ, ఎం.చంటిబాబు, జి.విశ్వనాథం, ఎ.శ్రీనివాసు పాల్గొన్నారు.

రేపు శాకంబరిగా బాల త్రిపుర సుందరి అమ్మవారు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలో ఉన్న బాల త్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులను దర్శమివ్వనున్నారు. అమ్మవారిని వివిధ రకాలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో సర్వాంగ సుందరంగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. అమ్మవారికి అలంకరణకు అవసరమైన కూరగాయలు, పండ్లు ఇచ్చే భక్తులు ముందురోజు సాయంత్రంలోగా ఇవ్వాలన్నారు.

నరసింహంకు అభినందన



డీఎస్‌వీఎల్ నరసింహం

కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన కాకినాడకు చెందిన వైద్యులు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహంకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయనను వీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి అదనపు బాధ్యతల్లో డాక్టర్ నరసింహం ఈ హోదాలో కొనసాగనున్నారు. నరసింహంనకు ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ బీబీ మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అభినందనలు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆలయకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు. ఆయన వెంట స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, ఏఎస్ఐ రాంబాబు ఉన్నారు.

డ్రైనేజీలను ఆక్రమిస్తే ఎలా?



నగరంలో డ్రైనేజీపై కట్టడాలను తొలగించాలని ఇంటి యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

- తక్షణమే తొలగించండి
- లేదంటే తొలగించి, ఆ చార్జీలను వసూలు చేస్తాం
- ఆక్రమణదారులకు కమిషనర్ ఆదేశం

కాకినాడ: డ్రైనేజీలపై సిమెంట్ స్లాబ్‌లు వేసి ఆక్రమిస్తున్న తీరుపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడిలపోర డ్రైన్, డీ-మార్ట్ ప్రాంతంలోని డ్రైనేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. చీడిలపౌర వద్ద ప్రధాన డ్రైనేజీలో గుర్రపుడెక్క పేరుకుపోవడాన్ని గుర్తించి రెండు మూడు రోజుల్లో తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డీ-మార్ట్ ప్రాంతంలో కొంతమంది డ్రైనేజీలపై సిమెంట్ స్లాబ్‌లు వేయడంపై ఆయన మండిపడ్డారు. చేసిన ఆక్రమణలు, వాటిపై ఏర్పాటు చేసిన సిమెంట్ స్లాబ్‌లను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేశారు. లేనికుంటే నగరపాలక సంస్థ తరఫున తొలగించి, అందుకు అయ్యే చార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూడిక తీత పనుల ప్రగతిని ఆయన పర్యవేక్షించారు.

టాయిలెట్ల పరిశీలన

సర్పవరం జంక్షన్‌లోని టాయిలెట్లను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు బుధవారం పరిశీలించారు. వీటి నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న నమ్మ టాయిలెట్లను ప్రజలు వినియోగించుకునేలా అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఆయన వెంట డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్ రాంబాబు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి



ఇంద్రపాలెంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



సర్పవరం ఆలయం వద్ద దర్శనాలకు క్యూలైన్లలో ఉన్న భక్తులు



యండమూరులో ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

- భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

కాకినాడ రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాలలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సర్పవరంలోని పురాతన ప్రసిద్ధమైన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి దర్శనాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ సిబ్బంది ఆలయ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఇంద్రపాలెంలో సీతారాముల ఆలయం, చీడిగలోని దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయం, సర్పవరం జంక్షన్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పలు గ్రామాలలో ఆలయాలను అందంగా ముస్తాబు చేసి, దేవతామూర్తులను అందంగా అలంకరించారు. ఆలయాలో దర్శనాలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



దేవాలయం వీధిలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలు

కరప మండలంలో...

కరప: స్థానిక విష్ణాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం, సహస్రనామ అర్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. పక్కనే ఉన్న వెంకటేశ్వరస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈఓ వడ్డాది తిరుమల రవితేజ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండమూరు ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కొంగోడులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పెనుగుదురు, జెడ్.భావారం, కూరాడ తదితర గ్రామాల్లోని విష్ణాలయాల్లోను పూజా కార్యక్రమాలు జరిగాయి.

నగరంలో...

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో పలు ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు జరిగాయి. స్థానిక దేవాలయంవీధిలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాందూరు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు పూర్తి చేశారు. స్వామి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారిని అనంత శయన రంగనాథస్వామిగా అలంకరించారు. స్థానిక భానుగుడి వద్ద ఉన్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గాంధీనగర్, వెంకట్‌నగర్, జగన్నాథపురం, అశోక్‌నగర్ ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

కాకినాడ సిటీ: నగరంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. తూరంగి, కొవ్వూరు, కాకినాడ సిటీలోని సాంబమూర్తినగర్, ఏటిమొగ, జగన్నాథపురం, అన్నమ్మఘాటీ, పద్మనాభనగర్ తదితర ప్రాంతాల్లో విష్ణాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున విష్ణు నామస్మరణ చేసే వారికి వైకుంఠ ప్రాప్తి కూడా కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయని భక్తులు నమ్మకం. రైతులకు కూడా ప్రత్యేకమైన రోజు అని తూరంగేశ్వరస్వామి ఆలయ అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా భజన బృందాలు ఏకాహం ప్రారంభించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు గ్యారంటీ

- ఎంఈఓ-2 సత్యనారాయణ
- నవోదయ ప్రవేశ పరీక్షపై అవగాహన



నవోదయ, సైనిక్ స్కూళ్ల ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ, ఫ్యాకల్టీలు

కరప: నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించుకుని, ప్రణాళికా బద్ధంగా చదివితే సీటు గ్యారంటీగా సాధించవచ్చని ఎంఈఓ-2 పి.సత్యనారాయణ పేర్కొన్నారు. అరట్లకట్టలోని మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నవోదయ, సైనిక్ స్కూళ్ల గురించి, అక్కడ అందించే విద్య గురించి వివరించారు. ఆయా స్కూళ్లల్లో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈపాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. నవోదయ, సైనిక్ స్కూళ్ల ప్రవేశపరీక్ష గురించి ఏయే సబ్జెక్టులు ఉంటాయి, ఎలా ప్రిపేర్ అవ్వాలో రీజనింగ్, ఇంగ్లిష్, జీకే, మాథ్స్, బయాలజీ ఫ్యాకల్టీస్ ఎస్.ధనరాజ్, ఏవీఆర్ నరేష్‌బాబు, వి.గోపాలకృష్ణ, జి.నాగేశ్వరరావు, పి.విజయ్, పి.కిశోర్ వివరించారు. గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంపీటీసీ సీహెచ్ కామేశ్వరి, గోపి గణేష్, ఎస్.దేవి, వెలుగుబంట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎన్.విశ్వేశ్వరరావు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు

గండేపల్లి: అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి హెచ్చరించారు. మండలంలోని సూరంపాలెం రామేశంపేట గుల్లమెట్ట ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండేపల్లి, ప్రత్తిపాడు రౌతులపూడి మండలాల్లో అనుమతులు లేని క్వారీల్లో మైనింగ్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను ఇప్పటికే సీజ్ చేసినట్టు తెలిపారు. గ్రావెల్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గుల్లమెట్టపై 234 ఎకరాలకు గాను 216 ఎకరాలు అసైన్డ్ భూములని, మిగిలినవి జిరాయితీ భూములుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేంత వరకూ ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు చేపట్టరాదన్నారు. రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గనుల శాఖ డీడీఈ నరసింహారెడ్డి, జిల్లా విజిలెన్స్ నిఘా విభాగం అధికారి సురేష్‌రెడ్డి, గండేపల్లి, పెద్దాపురం తహసీల్దార్లు జె.చిరంజీవి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.